ఆర్టీసీ విలీనం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

కార్మికుల హక్కుల కోసం టీజెఎంయు పోరాటం: నిర్మల జగ్గారెడ్డి

గద గుర్తుకు ఓటేసి హనుమంతును గెలిపించాలని పిలుపు



సంగారెడ్డి జిల్లా అక్టోబర్ 08 (నేటి మనదేశమ్): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికుల ఎన్నికల్లో టిజెఎంయు రాష్ట్ర కార్యదర్శి అభ్యర్థి హనుమంతుకు మద్దతుగా సంగారెడ్డిలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నిర్మల జగ్గారెడ్డితో పాటు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , సంగారెడ్డి డిపో గౌరవ అధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న కార్మికుల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఎన్నికల అనంతరం ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను హీనంగా చూసిందని ఆమె విమర్శించారు.కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న హనుమంతు మంచి వ్యక్తి అని పేర్కొన్న నిర్మల జగ్గారెడ్డి, అక్టోబర్ 9న జరిగే ఆర్టీసీ కార్మికుల ఎన్నికల్లో గదా గుర్తుకు ఓటు వేసి హనుమంతును గెలిపించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఎవరు ఎన్ని చెప్పినా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హనుమంతు చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని కోరారు.ఆర్టీసీ విలీనాన్ని ఇతర సంఘాల నాయకులు అడ్డుకుంటున్నారని టిజెఎంయు రాష్ట్ర కార్యదర్శి అభ్యర్థి హనుమంతు ఆరోపించారు. కార్మికుల అవసరాలను అడ్డుపెట్టుకుని చందాల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండతో టీజెవియు విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసిన ఆయన, కార్మికుల సమస్యల పరిష్కారం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు.సంగారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో పలువురు టీజెఎంయు నాయకులు, ఆర్టీసీ కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం..



ఆసిఫాబాద్, అక్టోబర్ 08 (నేటి మనదేశమ్) :: పోషకాహారం తీసుకోవడం ద్వారానే మనం ఆరోగ్యంగా చురుకుదనంగా ఉంటామని గోలేటి సర్పంచ్ ఏ బాబురావు అన్నారు గురువారం తక్కల్లపల్లి గోలేటి గ్రామపంచాయతీ లలో పోషకాహార మాసోత్సవం సందర్భంగా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు జంక్ ఫుడ్ చెక్కర ఉప్పు ఎక్కువగా ఉన్న పదార్థాలను తీసుకోవడం తగ్గించాలన్నారు పిల్లలకు చిన్న వయసు నుండే మంచి ఆహారపు అలవాట్లను నేర్పించాలన్నారు గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అన్నారు సందర్భంగా పిల్లలకు అన్నప్రాసనతోపాటు అక్షరాభ్యాసం చేయించారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ రేణుక ఏ సి డి పి ఓ ప్రియదర్శిని వైద్యాధికారి రిషిక సూపర్వైజర్ శిరీష కళావతి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

ఫ్యాషన్ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్



కామారెడ్డి,అక్టోబర్ 08.(నేటి మనదేశమ్ ప్రతినిధి)జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫ్యాషన్ క్లబ్‌ను ప్రారంభించిన చైర్‌పర్సన్, నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కామారెడ్డి పట్టణంలో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటవుతూ, ప్రజలకు వివిధ రకాల సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు.ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఫ్యాషన్ రంగంలో నూతన అవకాశాలను అందిపుచ్చుకుంటూ యువత, మహిళలు తమ ప్రతిభను చాటుకునేందుకు ఇటువంటి సంస్థలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఫ్యాషన్ క్లబ్ నిర్వాహకులు నాణ్యమైన సేవలను అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని చైర్ పర్సన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ బబ్లు ,జావీద్, చిట్టి బాబు ,లడ్డు, యూనుస్, సిద్దిక్, సత్యం, కో ఆప్షన్ అలీ భీన్ అబ్దుల్లా, మాజీ కౌన్సిలర్ నాయకులు అమీర్, నాగరాజు , శ్రీకాంత్ ,ఫ్యాషన్ క్లబ్ నిర్వాహకులు, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడు నెలలు నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి: జగ్గారెడ్డి

మళ్లీ వర్షాలు పడేంతవరకు ఏడు నెలలపాటు మంజీరా సింగూరు నీళ్లను తాగునీటి అవసరాల కోసం జాగ్రత్త గా వాడుకోండి

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు,కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు జగ్గారెడ్డి సూచన

సంగారెడ్డి నియోజకవర్గంలో తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష

సింగూరులో 29 టీఎంసీలకు బదులు కేవలం 3 టీఎంసీలే నీరు మాత్రమే ఉంది

నీటి వృథాను అరికట్టేందుకు ఇంటింటా అవగాహన కల్పించాలి



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 (నేటి మనదేశమ్): సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న ఏడు నెలలు తాగునీటి విషయంలో పరిస్థితి తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలో నెలకొన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, “కాలం చెప్పినట్లు, కాలానికి అనుగుణంగా నడుచుకోవాలి. ఈసారి సరైన వర్షాలు లేవు. మనం సింగూరు డ్యామ్‌పై ఆధారపడి ఉన్నాం. సింగూరుకు వచ్చే నీరు కర్ణాటక, మహారాష్ట్రలో కురిసే వర్షాలపై ఆధారపడి ఉంటుంది. ఎవరినో నిందిస్తే సమస్య పరిష్కారం కాదు. నీళ్లు ఉంటేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. నీటి లభ్యతను బట్టే వినియోగం ఉండాలి” అని పేర్కొన్నారు.సింగూరు ప్రాజెక్టులో 29 టీఎంసీల సామర్థ్యానికి ప్రస్తుతం సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే ఉందని సమావేశంలో అధికారులు వివరించారు. ప్రస్తుతం ఉన్న నీటితో డిసెంబర్ వరకు తాగునీటి సరఫరా కొనసాగించగలమని భావిస్తున్నట్లు తెలిపారు. దసరా తర్వాత రోజు విడిచి రోజు తాగునీరు విడుదల చేయనున్నట్లు మిషన్ భగీరథ ఎస్ఈ వెల్లడించారు.నీటి కొరతపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలతో పాటు నాలుగు మండలాల గ్రామాల్లో నీటి లభ్యత, పొదుపుపై చాటింపు వేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పాంప్లెట్లు, మైకుల ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని చెప్పారు.ఇళ్లలో నల్లా నీటిని వృథా చేయకుండా అవసరం లేని సమయంలో ట్యాప్‌లను తప్పనిసరిగా మూసివేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద పెద్దఎత్తున నీరు వృథా అవుతున్నందున దానిని నియంత్రించాలని సూచించారు. టైమర్ స్టార్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా నీటి వృథాను తగ్గించవచ్చని సమావేశంలో సూచనలు వచ్చాయి. సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే అంశాన్ని కూడా అధికారులు ప్రతిపాదించారు.వచ్చే ఏడు నెలలు పరిస్థితి తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ బాధ్యతగా వ్యవహరించి అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి” అని జగ్గారెడ్డి కోరారు. మంజీరా, సింగూరు పరిధిలో మోటార్లతో యథేచ్ఛగా నీటిని తోడటాన్ని నియంత్రించాలని సమావేశం లో పలువురు సూచించారు.మంజీరా బ్యారేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నీటి డ్రాయింగ్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించేలా విజ్ఞప్తి చేస్తే, సంగారెడ్డి మున్సిపాలిటీకి మరికొంత కాలం తాగునీటి సరఫరా కొనసాగించే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు. అవసరమైతే మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.కంది పరిసర చెరువుల్లో నీరు అందుబాటులో ఉందని, గ్రామంలోని 28 బోర్లకు అవసరమైన మోటార్లు ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. మిషన్ భగీరథ సరఫరాలో ప్రెషర్ పెంచితే ఇస్మాయిల్‌ఖాన్‌పేట, హనుమాన్‌నగర్, ఫసల్‌వాడి గ్రామాలకు నీటి సరఫరా మెరుగుపడుతుందని సమావేశంలో ప్రస్తావించారు. కంది మండలం తోపుగొండలో మిషన్ భగీరథ నీరు నెలకు నాలుగుసార్లు మాత్రమే వస్తోందని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్‌లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.సింగూరు ప్రాజెక్టు నుంచి ఇటీవల నీటిని విడుదల చేసిన అంశంపైనా జగ్గారెడ్డి స్పందించారు. ఢిల్లీ నుంచి వచ్చిన డ్యామ్ సేఫ్టీ అధికారులు సింగూరు ప్రాజెక్టును పరిశీలించగా, కట్టలో కొంత భాగం దెబ్బతిన్నట్లు గుర్తించి మరమ్మతుల కోసం కొంత నీటిని విడుదల చేయాలని సూచించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షణలో నిపుణుల కమిటీ సూచనల మేరకే నీటిని విడుదల చేసినట్లు చెప్పారు.భవిష్యత్తులో డ్యామ్‌ను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే నీటిని విడుదల చేశారు. ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజమే కానీ, సాంకేతిక నిపుణుల సూచనల మేరకు తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయం చేయడంలో అర్థం లేదు” అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.విద్యుత్ సమస్యలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. నియోజకవర్గంలో విద్యుత్ బ్రేక్‌డౌన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారంపై వచ్చే మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.

ఆర్‌టీఓ అధికారినంటూ సైబర్ మోసం

- డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ పేరుతో రూ.4,200 కాజేత

- నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

- వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



వేములవాడ, అక్టోబర్ 08: నేటి మన దేశమ్ ప్రతినిధి ఆర్‌టీఓ అధికారిగా ఫోన్‌లో తప్పుడు పరిచయం చేసుకుని డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ పేరుతో ఓ వ్యక్తిని మోసం చేసి డబ్బులు కాజేసిన నిందితుడిని వేములవాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు.హన్మాజీపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు జూన్ 1న ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను సిరిసిల్ల ఆర్‌టీఓ కార్యాలయం నుంచి నరేష్‌గా పరిచయం చేసుకున్నాడు. డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరించకపోతే లైసెన్స్ నిలిచిపోతుందని భయపెట్టాడు. అనంతరం తన ‘ఆర్‌టీఓ సార్’తో మాట్లాడిస్తానని చెప్పి, తన గొంతును మార్చుకుని తానే ఆర్‌టీఓ అధికారిగా మాట్లాడాడు. లైసెన్స్ పునరుద్ధరణ కోసం వెంటనే డబ్బులు చెల్లించాలని నమ్మించి బాధితుడి నుంచి ఫోన్‌పే ద్వారా మూడు విడతల్లో మొత్తం రూ.4,200 బదిలీ చేయించుకున్నాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 115/2026గా భారతీయ న్యాయ సంహితలోని 318(4) సెక్షన్, సమాచార సాంకేతిక చట్టంలోని 66-డి సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బ్యాంకు లావాదేవీలు, మొబైల్ నంబర్లు, స్వర రికార్డింగ్, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులు నిందితుడిని నీరటి తిరుమల్ (32), పాత అర్బన్ కాలనీ, వేములవాడగా గుర్తించారు.అక్టోబర్ 8న వేములవాడ అర్బన్ కాలనీలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరానికి సంబంధించిన విషయాలను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన వివో వి2036 మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఆర్‌టీఓ కన్సల్టెన్సీ కార్యాలయంలో పనిచేసిన అనుభవాన్ని ఆసరాగా చేసుకుని పరిచయమైన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఆర్‌టీఓ అధికారిగా నటిస్తూ డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఇదే తరహాలో మరికొందరి వద్ద కూడా డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు.ఇలాంటి మోసాలకు గురైన బాధితులు ఎవరైనా ఉంటే వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. ఆర్‌టీఓ, పోలీసులు, బ్యాంకు లేదా ఇతర ప్రభుత్వ అధికారుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని, సంబంధిత కార్యాలయాలను నేరుగా సంప్రదించి వివరాలను నిర్ధారించుకోవాలని సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వయోవృద్ధుల అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో విలువైనది

వయోవృద్ధుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి **అక్టోబర్ 08 (నేటి మనదేశమ్):** కామారెడ్డిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై వయోవృద్ధులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా 80 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన వయోవృద్ధులను ప్రత్యేకంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ శాలువాలు కప్పి వారిని ఘనంగా సన్మానించారు. సమాజ నిర్మాణంలో వయోవృద్ధులు అందించిన సేవలు, వారి అనుభవాలు, జ్ఞానాన్ని కొనియాడారు. వయోవృద్ధులకు గౌరవం, ఆప్యాయత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, వయోవృద్ధులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా నడక, యోగా, తగిన వ్యాయామాలు చేయాలని సూచించారు. వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహిస్తూ సమతుల్య ఆహారం తీసుకోవాలని, వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వయోవృద్ధుల అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో విలువైనదని, వారి సూచనలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతతో పాటు వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా వారికి అవసరమైన అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోదావరి, పున్న రాజేశ్వర్, రాజన్న, జిల్లా సంక్షేమ అధికారి వెంకటేష్, జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ప్రతినిధులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో వయోవృద్ధులు ఉత్సాహంగా పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. వయోవృద్ధుల పట్ల సమాజంలో గౌరవం, ఆప్యాయత, బాధ్యత మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.వయోవృద్ధుల సేవలను గుర్తించి, వారిని సత్కరించి నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

రైతులకు సరిపడా కరెంటు ఇవ్వలేని ప్రభుత్వానికి పాలించే అర్హత ఎక్కడిది?

మాజీ శాసనసభ్యులు 8బొల్లం మల్లయ్య యాదవ్





కోదాడ అక్టోబర్ 08 (నేటి మనదేశమ్): వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఈరోజు చిలుకూరు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లోని లాగ్‌బుక్‌లను, విద్యుత్ సరఫరాకు సంబంధించిన రికార్డులను పరిశీలించి నిరసన తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాలకు రోజుకు ఎన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు? విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారు? సరఫరాలో అంతరాయాలకు కారణాలేమిటి? అనే అంశాలపై విద్యుత్ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ,వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టత అవసరమని ఆయన పేర్కొన్నారు.రైతులకు సాగునీరు అందించడంలో విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని, సరైన సమయంలో కరెంటు అందకపోతే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందనీ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.రైతులకు సరిపడా కరెంటు ఇవ్వలేని ప్రభుత్వం.. రైతుల సంక్షేమం గురించి ఎలా మాట్లాడుతుంది? అని ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరించడం సరికాదని, క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో కూడా పరిస్థితులు ఉండాలని అన్నారు. అధికారిక రికార్డుల్లో నమోదైన విద్యుత్ సరఫరా గంటలకు, రైతులు వాస్తవంగా పొందుతున్న విద్యుత్‌కు మధ్య వ్యత్యాసం ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సరఫరా సమయాలు, కోతల వివరాలు, లో వోల్టేజీ సమస్యలు, తరచూ విద్యుత్ నిలిచిపోవడం వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు సక్రమంగా విద్యుత్ అందకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటే, ఆ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.రైతులకు సరిపడా విద్యుత్ సరఫరా చేయలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. రైతులకు పంటలు పొట్ట దశ కీలక సమయం కావున అవసరమైన సాగునీరు, విద్యుత్‌ను సక్రమంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని, విద్యుత్ సరఫరా సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

టీబీ రహిత గ్రామాలకు ప్రశంస పత్రాలు ప్రధానం



మానకొండూరు అక్టోబర్ 08 (నేటి మనదేశమ్): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ ముక్త భారత్ చొరవను అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో క్షయ వ్యాధిపై అవగాహన పెంచడం,ముందస్తు గుర్తింపు,ఉచిత వైద్య సేవలను అందించడం ద్వారా గ్రామాలను టీబీ రహితంగా మారుతున్నవి.కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జిల్లాలోని గ్రామాలకు టీబీ ముక్త్ భారత్ గ్రామపంచా యతీలుగా ప్రకటించారు. మానకొండూరు మండలంలో 29 గ్రామపంచాయతీలలో పెద్దూరు పల్లి,బంజరుపల్లి, వన్నారం, శంషాబాద్,పోచంపల్లి, లింగాపూర్, రాఘవపూర్ గ్రామాలు టీబీ ముక్త్ భారత్ గ్రామపంచాయతీలుగా ఎంపికయ్యాయి.జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆయా గ్రామాల సర్పంచ్లకు,పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్,జిల్లా వైద్యాధికారి రాజగోపాల్ చేతుల మీదుగా ప్రశంస పత్రం, అవార్డులను ప్రధానం చేశారు.ఆయా గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ లో టీబీ నియంత్రణకు చేపట్టిన చర్యలు ప్రజల్లో ఆరోగ్య అవగాహన,వైద్య ఆరోగ్యశాఖ, గ్రామపంచాయతీ సిబ్బంది సమిష్టి కృషి తో సాధ్యమైనట్లు తెలిపారు.

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

Truhome FINANCE

రిజిస్టర్డ్ ఆఫీస్ : శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోరు నెం.5, పాత నెం.11, 2వ లేను, సెనటోఫ రోడ్డు, ఆల్వార్ పేట,తేనం పేట చెన్నై-600018.
ప్రధాన కార్యాలయము: లెవెల్-3, చార్టర్ టవర్స్, ఈస్ట్ వింగ్ సి-2, జి బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400 051,
వెబ్‌సైట్: www.truhomefinance.in

సవరణ ప్రకటన

దయచేసి, 29.09.2026 తేదీన వరంగల్ వార్తాపత్రికలో ప్రచురితమైన మా వేలం ప్రకటనను చూడండి. ఇది రుణగ్రహీత (శ్రీ గోదిశాల కోమల్ గౌడ్ (లాన్: SHLHWRNG0000991) గారికి సంబంధించినది. దయచేసి ఈ క్రింది విధంగా చదవండి, ఆంగ్ల మరియు తెలుగు పత్రికలలో వేలం తేదీ 16-10-2026 మరియు తనిఖీ తేదీ: 15-10-2026 (ఆంగ్లం మరియు తెలుగు పత్రికలలో): తేదీ & సమయం మరియు తనిఖీ తేదీ & సమయం కాలమ్‌లో 03-11-2026 కు బదులుగా ఈ మార్పు చేయబడింది.
ఈ పొరపాటుకు చింతిస్తున్నాము.
ప్రచురించిన మిగతా సమాచారం అంతా యథాతథంగా ఉంటుంది.

స్థలం: వరంగల్, తెలంగాణ
తేదీ: 09-10-2026
సం|| అధీకృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)